క్లుప్తంగా

పాఠశాలల సందర్శన



విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని బొద్దాం, కొత్తబొద్దాం ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ బాలభాస్కరరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలకు సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే కిచెన్ గార్డెన్‌లను పరిశీలించి, పండిన కూరగాయలను మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

47 మందికి వైద్యసేవలు



గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కొత్తవలస: మండలంలోని రాయపురాజుపేటలో వియ్యంపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. 47 మంది రోగులను పరీక్షించగా.. ఏడుగురు జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించామని వైద్యసిబ్బంది తెలిపారు. మలేరియా, డెంగీ ప్రబలకుండా ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కొట్యాడ శ్రీనివాసరావు, బొట్ట రాము, ఆరోగ్య సిబ్బంది సత్యారావు, సుధా, లక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్త అప్పలకొండ, తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం



షికారుగంజి మోడల్ స్కూల్‌లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై జి.రాజేష్

దత్తిరాజేరు: విద్యార్థి దశలో ఆటలాడడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ఎస్సై జి. రాజేష్ అన్నారు. షికారుగంజి ఆదర్శ పాఠశాలలో ఆగస్టు 15 సందర్భంగా బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈశ్వరరావుతో పాటు కలిసి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించడం వల్ల ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డిపో ఏర్పాటు చేయాలి



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

వేపాడ: మండలంలోని వీలుపర్తి పంచాయతీ గిరిజన గ్రామాలైన చిన, పెద దుంగాడ గ్రామాలకు ఒక రేషన్ డిపో మంజూరు చేయాలంటు స్థానిక పెద్దలు అప్పారావు, దేముడు, తదితరులు కోరుతున్నారు. ఈమేరకు దుంగాడలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యావసర సరుకులకు వీలుపర్తి వెళ్లాల్సి వస్తోందని, అధికారులు స్పందించి చినదుంగాడలో డిపో ఏర్పాటు చేయాలని కోరారు.

పరామర్శ



సూరప్పడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గెదేల సూరప్పుడు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాట్నూరు సన్యాసినాయుడు , జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు బుధవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సూరప్పుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

చీపురుపల్లి: మేజర్ పంచాయతీ పరిధిలో దోమలు నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్ తెలిపారు. అందులో భాగంగానే మేజర్ పంచాయతీ పరిధిలోని హడ్కోకాలనీ, రిక్షాకాలనీ, డైలీ మార్కెట్, కొత్త అగ్రహారం, తదితర ప్రాంతాల్లో గల కాలువల్లో బుధవారం బ్లీచింగ్, దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రాము, తదితరులు పాల్గొన్నారు.

నీరు రాదు.. సాగు జరగదు..



గడిగెడ్డ రిజర్వాయర్‌లో ఉన్న అరకొర నీరు

- అన్నదాతను వీడని సాగునీటి కష్టాలు
- గడిగెడ్డ రిజర్వాయర్‌లో అరకొరగా నీరు
- తోటపల్లి కాలువల ద్వారా నీరు చేరకపోవడంతో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

గుర్ల: తోటపల్లి రిజర్వాయర్‌లో నీరు ఉంది కాని పొలాల వరకు రావడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వర్షాలతో పనిలేకుండా తోటపల్లి కాలువల ద్వారా చివరి ఎకరాకు నీరు అందిస్తామని చెప్పి ఎన్నికలలో గెలిచిన నాయకులు ప్రస్తుతం రైతుల గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడిగెడ్డ రిజర్వాయర్‌ను అనుకొని ఉన్న గ్రామాలకు సాగునీరు అందక 17 గ్రామాలకు చెందిన రైతులు వరి నాట్లు వేయడానికి వీల్లేకుండా పోయింది. తోటపల్లి కాలువ నీరు ద్వారా గడిగెడ్డకు నీరు అందించాలి. కాని ఇంతవరకు కాలువల నుంచి చుక్క నీరు కూడ రిజర్వాయర్‌లోకి చేరలేదు. ఇదీ మండలంలోని గడిగెడ్డ రిజర్వాయర్ పరిస్థితి. తోటపల్లి ప్రాజెక్ట్ నుంచి గడిగెడ్డ రిజర్వాయర్‌లోకి నీరు మళ్లించి 0.25 టీఎంసీల నీటిని నిల్వ చేసి శివారు గ్రామాలకు గతంలో అందించేవారు. అయితే ప్రస్తుతం తోటపల్లి కాలువ ద్వారా చుక్క నీరు కూడా రాకపోవడంతో గడిగెడ్డ రిజర్వాయర్ నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. గడిగెడ్డ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల ద్వారా మండలంలోని తెట్టంగి, పాలవలస, గూడెం, గరికివలస, పల్లిగండ్రేడు, నల్లచెరువు, పున్నపురెడ్డిపేట, గోల్లలపేట, గోవుపేట, బూర్లిపేట, గరికివలస గ్రామాలతో పాటు గజపతినగరం మండలంలోని కెంగువ గ్రామానికి సాగు నీరు వెళ్తుంది. గడిగెడ్డ రిజర్వాయర్ కింద సుమారు మూడు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గజపతినగరం మండలంలోని కెంగువ గ్రామంలో సుమారు 500 ఎకరాలకు గడిగెడ్డ నీరే ఆధారం. తోటపల్లి నీరు రాక.. వర్షాలు పడకపోవడంతో గడిగెడ్డ రిజర్వాయర్‌కు నీటి కొరత ఏర్పడింది. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.05 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. సాగునీరు అందకపోతే సాగు ఎలా చేపట్టాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. గడిగెడ్డ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలలో కనీసం పూడికలు కూడా తీయలేదని రైతులు ఆరోపిస్తున్నారు.



పెనుబర్తి వద్ద తోటపల్లి కాలువలో ఏపుగా పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలు



పూడికలతో నిండిన గడిగెడ్డ రిజర్వాయర్ కుడికాలువ

నాట్లు వేయడానికి ఆలోచిస్తున్నాం..

గడిగెడ్డ రిజర్వాయర్‌లో అరకొరగా నీరు ఉండడం వల్ల వరి నాట్లు వేయడానికి ఆలోచిస్తున్నాం. వర్షాలు పడి రిజర్వాయర్ నిండితే నీరు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది వర్షాలు కూడా తగినంత పడకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– బొత్స శంకరరావు, రైతు, బూర్లిపేట

గడిగెడ్డ నీరే ఆధారం..

రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న పంటపొలాలుకు గడిగెడ్డ నీరే ఆధారం. వర్షాలు సమృద్ధిగా పడకపోవడంతో పాటు తోటపల్లి కాలువ నీరు గడిగెడ్డకు రాలేదు. రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా లేకపోవడంతో అధికారులు సాగు నీరు విడుదల చేయడం లేదు.

– బూర్లె జోగినాయుడు, రైతు, బూర్లె పేట

సాగునీరు అందిస్తాం..

గడిగెడ్డ రిజర్వాయర్ ద్వారా మాత్రం రైతులకు సాగునీరు అందించడానికి సమయం పడుతుంది. ఆగస్టులో సాగు నీరు అందించడానికి సిద్ధం చేస్తున్నాం. వర్షాలు సకాలంలో పడకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నట్లు ఉన్నతాధికారులకు తెలియజేశాం.

– సంతోష్, ఇరిగేషన్ ఏఈ , గుర్ల

ద్రవరూప ఎరువులే మేలు

- వ్యవసాయశాఖ ఏడీఏ అలజంగి నిర్మలాజ్యోతి



రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్న ఏడీఏ అలజంగి నిర్మలాజ్యోతి

గజపతినగరం: రైతులందరూ నానో యూరియా, నానో డీఏపీ వంటి ద్రవరూప ఎరువులపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ గజపతినగరం డివిజన్ సహాయ సంచాలకుడు అలజంగి నిర్మలాజ్యోతి సూచించారు. మండలంలోని చిట్టాయవలసలో బుధవారం 'పొలంబడి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీఏపీ బస్తాతో పోలిస్తే నానో డీఏపీ 750 రూపాయలు తక్కువగా ఉంటూ పొలానికి సమపాళ్లలో నత్రజని, భాస్వరం అందిస్తుందని చెప్పారు. వరి పంటలో రెండోసారి.. మొక్కజొన్న, పత్తి పంటల్లో మొదట సారి నానో యూరియా వేయాలని సూచించారు. అలాగే నేల ఆరోగ్యం, మిత్ర పురుగుల సంరక్షణ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయశాఖాధికారి పి.కిరణ్‌కుమార్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు భరోసా ఏదీ..?



స్వర్ణపూడి వెంకటరమణ

వేపాడ: కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు భరోసా కల్పించకపోవడంతో చేనేత కార్మికులు నిరాశ్రయులవుతున్నారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ వీవర్ వింగ్ అధ్యక్షుడు స్వర్ణపూడి వెంకటరమణ ఆరోపించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వస్తే చేనేత కార్మికులకు కల్పిస్తామన్న భరోసా ఇంతవరకు కల్పించలేదన్నారు. 50 ఏళ్లకే అందిస్తామన్న పింఛన్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. గురువారం చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా 50 ఏళ్లకే పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు. నియోజకవర్గంలో చేనేత పెన్షన్‌కు అర్హత పొందిన వారు 824 మంది ఉన్నారన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.

ఎమ్మెల్సీపై దాడి తగదు..

గుర్ల: వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, రాష్ట్ర బీసీ సెల్ నేత రమేష్ యాదవ్‌పై టీడీపీ గుండాలు దాడి చేయడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడిని ఖండిస్తూ, జిల్లా కేంద్రంలోని జ్యోతిరావ్‌పూలే విగ్రహానికి గురువారం వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి బీసీ నాయకులందరూ హాజరుకావాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

గజపతినగరం రూరల్: మండలంలోని జిన్నాం సబ్‌స్టేషన్ పరిధిలో గల 33 కేవీ ఫీడర్లకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి పది వరకు సరఫరా ఉండదని ఏఈ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గజపతినగరం, పురిటిపెంట, ఎం.వెంకటాపురం, సీతారామపురం, కాలంరాజుపేట, డోలపాలెం, మధుపాడ, ఎన్‌జీఆర్ పురం, తమ్మారాయుడుపేట, పాతబగ్గాం, కొత్తబగ్గాం, కొణిశ, గంగచోళ్లపెంట, మల్లునాయుడుపేట, తుమ్మికాపల్లి, తదితర గ్రామాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పొదుపు, రుణాలపై ప్రగతి నివేదికలు

- డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ రత్నాకర్

గజపతినగరం: స్వయం సహాయక సంఘ సభ్యులు ఎప్పటికప్పుడు సమావేశమై పొదుపు, రుణాలపై ప్రగతి నివేదికలు తయారుచేసుకోవాలని డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ రత్నాకర్ తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సమాఖ్య ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలు తప్పకుండా నెలకోసారి జియో ఫెన్సింగ్ ద్వారా సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. పొదుపు, అప్పులు, తదితర అన్ని విషయాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం డీపీఎం లక్ష్మీనాయుడు మాట్లాడుతూ.. సూక్ష్మ రుణప్రణాళిక విధానం.. బ్యాంక్‌లు.. స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు ప్రణాళికాబద్ధంగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం పి.నారాయణరావు, వెలుగు సీసీలు మూర్తి, సత్యనారాయణ, రామునాయుడు, శేఖర్, కైలాస్, వీఓ అధ్యక్షులు, వీఓఏలు పాల్గొన్నారు.

ఫారం పాండ్స్‌పై ప్రత్యేక దృష్టి

- డ్వామా పీడీ శారదాదేవి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శారదాదేవి

మెరకముడిదాం: ఉపాధి పనుల్లో భాగంగా రైతులకు ఉపయోగపడే ఫారం ఫాండ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శారదాదేవి ఉపాధి సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులకు నిర్వహిస్తున్న ఎస్ఎంఎంఎస్-2.0 పై శిక్షణ, సమీక్ష కార్యక్రమాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హార్టికల్చర్, ఎవెన్యూ ప్లాంటేషన్, చెరువు గట్లు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటడంపై పలు సూచనలు చేశారు. అలాగే చేపలు, కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ కామేశ్వరరావు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ నరేంద్రకుమార్, పలువురు సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

అబద్ధాలు చెప్పడం కూటమి నాయకుల నైజం

- వైఎస్సార్‌సీపీ నాయకులు
- బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడికి సవాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: అధికారంలోకి వచ్చేందుకు వచ్చి అబద్ధాలు ఆడడం.. తీరా అధికారం చేపట్టాక అబద్ధాలు ఆడడం వారి నైజమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేసిన కూటమి నాయకులు సంక్షేమ పథకాల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ ప్రభుత్వాల హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో.. సంక్షేమ పథకాలు ఎక్కువగా ఎవరు అమలు చేశారో ప్రజాక్షేత్రంలో తేల్చుకోవడానికి సిద్ధమా అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునకు సవాల్ విసిరారు. ఇటీవల టీడీపీ నాయకుడు కిమిడి నాగార్జున పత్రికా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం 80 శాతం హామీలు అమలు చేసిందని.. వాటిని చూసి వైఎస్సార్‌సీపీ నాయకులు భయపడుతున్నారని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో పెన్షన్ రూ.వెయ్యి పెంచారు తప్ప ఇంకేం పథకాలు అమలు చేశారో చెప్పాలన్నారు. ఒక్కరైనా కొత్త వృద్ధాప్య పెన్షన్ ఇచ్చారా అని ప్రశ్నించారు. ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పెన్షన్, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేని చేతకాని విద్యాశాఖ మంత్రి ఉన్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతాడ లక్ష్మణ, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్, కంచుపల్లి అశోక్, ప్రభాత్, తదితరులు పాల్గొన్నారు.

అదానీ పవర్‌ప్లాంట్‌ను అడ్డుకుందాం

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న



నినాదాలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, గిరిజనులు

వేపాడ: మారిక కొండపై ఏర్పాటు చేయనున్న అదానీ పవర్ ప్లాంట్‌ను అడ్డుకుందామని.. వచ్చేవారిని తరిమి కొడదామని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. వెంకన్న పిలుపునిచ్చారు. మారిక గ్రామం వద్ద సంప్రదాయ విల్లంబులు పట్టి అదానీ ప్రాజెక్ట్‌ను అడ్డుకుందామంటూ బుధవారం నినాదాలు చేశారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అధ్వర్యంలో జరిగిన ఆందోళనలో వెంకన్న మాట్లాడుతూ.. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ చేసిన ప్రకటనకు జీఓ తెచ్చి మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. మారిక గెడ్డల ద్వారా వచ్చే నీరు నిలిచిపోతే నాగయ్యపేట, వావిలపాడు, వీలుపర్తి, తదితర గ్రామాలకు సాగునీరు ప్రశ్నార్థకమవుతుందన్నారు. మారిక, చింతలపూడి గ్రామాలను ఖాళీ చేయించేందుకు అదానీ కంపెనీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గిరిజనులు ఐకమత్యంతో పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీర్రాజు, ఆనంద్, సోమేష్, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం..



మెరకముడిదాం: మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు



ఎస్.కోట : ఎంపీడీఓ కార్యాలయంలో సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, తదితరులు



వేపాడ: మండల కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతం చేసిన సీడీపీఓ ఉమాదేవి, తదితరులు

బిడ్డకు తల్లిపాలే అమృతమని... పుట్టిన ఆరు నెలల వరకు పాలు తప్పనిసరిగా పట్టాలని వక్తలు అభిప్రాయపడ్డారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వాడవాడలా అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించడంతో పాటు గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. అపోహలు విడనాడి పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టాలన్నారు. ఎస్.కోట ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ.. మహిళలకు మాతృత్వం ఒక వరమన్నారు. బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిపాలు తప్పనిసరన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

కోర్టు ఉద్యోగులకు ఆటల పోటీలు



చెస్ ఆడుతున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

శృంగవరపుకోట: భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో కోర్టు సిబ్బంది, న్యాయవాదులకు ఆటల పోటీలను మెజిస్ట్రేట్ బి.కనకలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సూరిదేముడు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కనకలక్ష్మి క్యారెమ్స్ ఆడి క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్యారెమ్స్, చెస్, క్విజ్, మ్యూజికల్ చైర్, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు 15న బహుమతులు అందిస్తామన్నారు. నిత్యం విధుల నిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగులకు క్రీడలు కాస్తంత ఆటవిడుపుగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్సు, కారు ఢీ

- తప్పిన పెను ప్రమాదం



బోల్తా పడిన బస్సు

గుర్ల: మండల కేంద్రంలోని శివాలయం ఎదురుగా ఉన్న శ్మశానం వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. చీపురుపల్లి నుంచి విజయనగరం ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సును విజయనగరం నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న గుర్ల మండలంలోని గరిడ సర్పంచ్ టి.సూరిబాబుకు గాయాల య్యాయి. కారును తప్పించబోయి రోడ్డు పక్కకు బస్సును తరలించడానికి డ్రైవర్ ప్రయత్నించగా బస్సు ఒరిగి క్రమేపీ పంట పొలంలో బోల్తా పడింది. బస్సు బోల్తా పడడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. బస్సు క్రమేపీ ఒరిగి బోల్తా పడడంతో ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సు బోల్తా పడిన సమయంలో బస్సులో సుమారుగా 20 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఎస్సై పి. నారాయణ రావు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేశారు. అనంతరం ఆర్టీసీ అధికారులు బోల్తా పడిన బస్సును క్రేన్ సహాయంతో బయటకు తీశారు.

మోసానికి మారుపేరు చంద్రబాబు..



జామి: వీఆర్ పాలెంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్, సబ్బవరపు అరుణ, ఫణిబాబు, తదితరులు



చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి మండలం దువ్వాం గ్రామంలో కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు తోట స్వాతి, తోట రవికుమార్, మీసాల విశ్వేశ్వరరావు



మెరకముడిదాం: గోళ్లలవలస పంచాయతీ రాచపేటలో 'బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, తదితరులు

అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు మోసపూరిత పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసానికి మారు పేరని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబానికి ఎంత నష్టం చేకూరినదీ వివరించారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అనడం చూస్తుంటే వారికి మేనిఫెస్టో మీద ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హామీలు అమలు చేయనప్పుడు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎంతో అభివృద్ధి, సంక్షేమం చోటుచేసుకుందని.. కూటమి ప్రభుత్వ ఏడాదిన్నర పాలనలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయలేని కూటమి నాయకులు గ్రామాల్లోకి వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు.

– జామి/గరివిడి/మెరకముడిదాం